క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె రూరల్ : వివాహ బంధంతో ఒక్కటవుతున్న నూతన వధూవరులు జ్యోత్స్న, చైతన్యలను, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. శనివారం మదనపల్లె మండలం సీటీఎంలో సోమల మండలం కందూరు సర్పంచ్ సురేంద్రరెడ్డి సోదరుడు వెంకటరెడ్డి కుటుంబ వివాహ వేడుకకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం



వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కలికిరి : మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ చక్కెరవాండ్లపల్లిలో వెలిసిన శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు అర్చన, పంచామృతాభిషేకం అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణలు, సాంప్రదాయ మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండుగగా కల్యాణోత్సవం నిర్వహించారు. కలికిరి పట్టణానికి చెందిన దాతలు మధుసూదన్‌రెడ్డి, రేవంత్‌లు అమ్మవార్లకు తాళిబొట్టు, మెట్టెలను వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంకాలమ్మ గుడికి రూ.1.52 లక్షల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రౌద్రాల అంకాలమ్మ గుడికి హుండీ లెక్కింపు ద్వారా రూ. 1.52 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో మంజుల, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శశికుమార్ తెలిపారు. శనివారం ఆలయంలో మూడు నెలలకు సంబంధించి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 1,52,926 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పీలేరు సాధన అభివృద్ధి కమిటీ సభ్యులు

పీలేరు రూరల్ : పీలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డికి పీలేరు సాధన అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా మదనపల్లెను జిల్లాగా, పీలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని కోరారు. పీలేరు, కలకడ, కలికిరి, కేవీపల్లె, గుర్రంకొండ, వాల్మీకిపురం, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్ చేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు.

శ్రీ నారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతలో మెరిసె.. అవార్డుతో మురిసె

బసినికొండ పాఠశాలకు పురస్కారం



మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల అరుదైన పురస్కారం లభించింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికి గుర్తింపు లభించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-2025 జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి స్థానం దక్కించుకుంది . ఈనెల 6వతేదీన జిల్లా కేంద్రమైన రాయచోటిలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

పరిశుభ్రత కార్యక్రమాలు, అట స్థలాలు, తోటల సంరక్షణలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కృషి చేశారు. ఆరోగ్యాన్ని కాపాడే వాతావరణ సృష్టి విద్యార్థులో శుభ్రతపై అవగాహన కల్పనవంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చారు.

నందవనంలా..

బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల నందన వనాన్ని తలపిస్తుంది. విద్యార్థులు చదువుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పచ్చనితోటలు, పండ్ల మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పాఠశాల ఆవరణమంతా పచ్చదనాన్ని పరుచుకుంది. పాఠశాలలో అరుదైన మొక్కలు పెంచుతున్నారు. ఆకుకూరల తోటలు నిర్వహిస్తున్నారు. పాఠశాల మొత్తం పచ్చదనం ఫరిడవిల్లే విధంగా మొక్కలను సంరక్షిస్తున్నారు. పరిశుభ్రమైన తరగతి గదులు,తాగునీటి వసతి, ప్లాస్టిక్ రహిత ప్రాంగణం జిల్లా విద్యాశాఖ అధికారుల బృందాన్ని ఆకట్టుకుంది. దీంతో జిల్లా స్థాయి గౌరవం దక్కింది.

అవగాహన ర్యాలీలు :

పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, ఓజోన్ పొర కాపాడే విషయంలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. అలాగే వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటి కారణంగా పాఠశాలకు అవార్డు తమ సొంతమైంది.

సంతోషంగా ఉంది

పాఠశాలకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కింద జిల్లా స్థాయిలో మొదటి స్థానం రావడం సంతోషంగా ఉంది. ఇది మా పాఠశాల సాధించిన ఘనత. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. – శ్రీనివాసులు, హెచ్‌ఎం, బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల



ఓజోన్ పొర రక్షణపై అవగాహన ర్యాలీ (ఫైల్)



పచ్చని మొక్కల మధ్య పాఠశాల



మొక్కలు నాటే కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు (ఫైల్)

విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనపై దృష్టి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.ఎల్.సాయికుమార్

మదనపల్లె సిటీ : విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనపై దృష్టి సారించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.ఎల్.సాయికుమార్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఉత్తమ భవితవ్యానికి మన వైఖరి, ప్రవర్తనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచి వైఖరి, ప్రవర్తన, వ్యక్తిత్వవికాసం, జీవితం పట్ల సరైన దృక్పథం ఎలా ఉండాలోనేది వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతికి సరైన ప్రవర్తన, దృక్పథం ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పాటు అందుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు, సైన్స్ విభాగాధిపతి అమరనాథరెడ్డి, కెరీయర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ ఈశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ మృతికి నివాళి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి సచివాలయంలో పని చేసే డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్ణప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో శనివారం మండల పరిషత్ సిబ్బంది క్రిష్ణప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు.

ఐటీఐలో ఉచిత టైలరింగ్ శిక్షణ

తంబళ్లపల్లె : స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిల్క్‌హబ్ ద్వారా మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇస్తారని స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య, టీఓ నాగరాజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు పైబడి 45 సంవత్సరాల లోపు మహిళలు అర్హులన్నారు. ఆసక్తికలిగిన వారు ఈనెల 15వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు 9618655759 సంప్రదించాలన్నారు.

విద్యార్థుల రవాణా ఇబ్బందులు పరిష్కరించాలి

మదనపల్లె రూరల్ : గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని విద్యాసంస్థలకు వచ్చే విద్యార్థులకు రవాణాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ కోరారు. శనివారం వన్‌డిపో మేనేజర్‌ను కలిసి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలన్నారు. గ్రామీణ రూట్లలో బస్సుల కొరత కారణంగా విద్యార్థులు సకాలంలో కాలేజీ, స్కూల్స్‌కు చేరుకోలేకపోతున్నారన్నారు. ఉన్న కొద్దిపాటి బస్సుల్లోనే ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందన్నారు. పాఠశాలల వేళల్లో అదనపు బస్సులను నడపాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో కుటుంబాలకు ఆదా

చేనేత కార్మికులకు అవగాహన సదస్సు



జీఎస్టీ ప్రయోజనాలపై చేనేత కార్మికులకు వివరిస్తున్న జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ పవన్‌కుమార్

మదనపల్లె రూరల్ : రాష్ట్రప్రభుత్వం నెలరోజుల పాటు నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ 2.0 ద్వారా కలిగే ప్రయోజనాలను చేనేత కార్మికులకు వివరించేందుకు పట్టణంలోని చౌడేశ్వరి కల్యాణమండపంలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించారు. సూపర్ జీఎస్టీ ద్వారా ప్రతి కుటుంబానికి రూ.15వేల వరకు ఆదా సాధ్యమవుతోందని, వ్యాపార వృద్ధికి ఇది బలాన్ని ఇస్తుందన్నారు. నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, ఆరోగ్యసేవలు తదితర 99 శాతం వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడంతో ఈ ప్రయోజనాలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తాయన్నారు. చేనేత రంగానికి సంబంధించి...రూ.1000 కంటే తక్కువ ధర ఉన్న చేనేత వస్త్రాలపై 5శాతం, ఆ ధర కంటే ఎక్కువ ధర ఉండే చేనేత వస్త్రాలపై 12శాతం జీఎస్టీని ఇప్పటి వరకు విధించారన్నారు. నూతన జీఎస్టీ 2.0లో రూ.2,500 కంటే తక్కువ ధర ఉండే వస్త్రాలపై 5 శాతం విధించనున్నారని తెలిపారు. పలువురు చేనేతసంఘం నాయకులు జీఎస్టీతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కూటమిప్రభుత్వం చేనేతలకు అమలుచేస్తానన్న హామీలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అధికారులు ప్రవీణ్‌కుమార్, వెంకటకుమార్, ఏపీ బీసీ సంక్షేమసంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు వీరభాస్కర్, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, చేనేత ఐక్యవేదిక మోడెంనాగరాజు, మదనపల్లె చేనేత కార్మిక యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

- సన్మాన సభలో తిప్పారెడ్డి, షమీంఅస్లాం
- నిసార్‌హ్మద్ ఆధ్వర్యంలో సన్మాన సభ



తిప్పారెడ్డి, షమీంఅస్లాంలను సత్కరిస్తున్న నిసార్‌అహ్మద్, తదితరులు

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జి.షమీం అస్లాం అన్నారు. శనివారం సమన్వయకర్త నిసార్ అహ్మద్ అధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమాన్ని స్థానిక దేశాయి ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేసే అవకాశాన్ని పార్టీ తనకు కల్పించిందన్నారు. సీఈసీ మెంబర్‌గా నియమించడం తనకు ఇచ్చిన గుర్తింపు, బాధ్యతగా భావిస్తానన్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టించి పనిచేస్తానని అన్నారు. షమీంఅస్లాం మాట్లాడుతూ ముస్లిం మహిళ అయినకు తనకు పార్టీ గుర్తింపు ఇచ్చి పదవులను కట్టిబెట్టిందన్నారు. ఏపీఎండీసీ చైర్మన్ చేయడమేకాక జిల్లా పార్టీ మహిళ విభాగానికి అధ్యక్షురాలిని చేశారన్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంలో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మించిన మహిళా పక్షపాతి మరోకరు లేరన్నారు. సమన్వయకర్త నిసార్ అహ్మద్ మాట్లాడుతూ తామంతా కలసికట్టుగా మదనపల్లెలో పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో తిప్పారెడ్డి, షమీంఅస్లాం పార్టీ కోసం పడుతున్న కష్టానికి గుర్తింపుగా పదవులు దక్కాయన్నారు. మున్సిపల్ చైర్మన్ వరపన మనూజ మాట్లాడుతూ తిప్పారెడ్డిన విలువలు కలిగిన వ్యక్తని అన్నారు. ప్రజాసేవలో అయన అనుభవం పార్టీకి ఉపయోగపడతాయన్నారు. అనంతరం నిసార్‌అహ్మద్, మనూజ, నియోజకవర్గానికి చెందిన పార్టీనేతలు ఇద్దరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు రామచంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ నూర్ అజం, మేధావుల ఫోరం రాష్ట్రకార్యదర్శి వీఎస్.రెడ్డి, కౌన్సిలర్లు బీఏ.ఖాజా, ప్రసాద్‌బాబు, పాల్ చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రాజేష్, ఈశ్వర్‌నాయక్, మాజీ కౌన్సిలర్లు సురేంద్ర, ఇర్ఫాన్‌ఖాన్, సర్పంచులు శరత్‌రెడ్డి, నాయకులు వెలుగుచంద్ర, గుండ్లూరు రఫీ, ఆవుల మల్లికార్జున, ఎల్.రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, మేరీ, బషీరీ, లలితారెడ్డి, శారదరెడ్డి పాల్గొన్నారు.

యల్లమ్మ తల్లీ..చల్లగ చూడమ్మా



యల్లమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యులతో నిసార్

మదనపల్లె రూరల్ : దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జగన్ కాలనీలోని యల్లమ్మ ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. శనివారం జగన్ కాలనీ యల్లమ్మ ఆలయానికి వచ్చిన నిసార్ అహ్మద్‌కు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో యల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ...కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి యల్లమ్మ తల్లిని, నియోజకవర్గంలోని ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సమృద్ధిగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు బయ్యారెడ్డి, విజయ్‌భాస్కర్, ఎస్.శంకర్‌రెడ్డి, నగేష్, బి.రమణ, శివశంకర్, రాము, లక్ష్మీపతి, రెడ్డిశేఖర్, వీరాంజనేయనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనం




దుర్గాదేవిని నిమజ్జనానికి తీసుకెళుతున్న దృశ్యం

గుర్రంకొండ : మండలకేంద్రమైన గుర్రంకొండలో శ్రీదుర్గాదేవి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని దళితవాడలో తొలిసారిగా దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పదిరోజుల పాటు భక్తిశ్రద్ధలో పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి అందంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ అమ్మవారిని గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. దుర్గామాతకు జై అంటూ అనే నినాదాలతో పట్టణం హోరెత్తింది. సాయంకాలం గ్రామానికి సమీపంలోని చెరువులో ఘనంగా నిమజ్జనం కావించారు. ఊరేగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రఘురామ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


రేపటి నుంచి డివిజన్ స్కూల్‌గేమ్స్ పోటీలు

మదనపల్లె సిటీ : మదనపల్లె డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14,-17బాల,బాలికల క్రీడలు ఈనెల 6వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు మదనపల్లె డివిజన్ స్పోర్ట్సు కో ఆర్డినేటర్ భద్రయ్య తెలిపారు. 6వతేదీ వాలీబాల్, బాడ్మింటన్ ,యోగా పోటీలు మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. 7వతేదీ కబడ్డీ, చెస్ సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 8వతేదీ ఖోఖో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు 10వ తేదీన మదనపల్లె డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ మీట మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. మండల టీంతోపాటు ఎస్‌జీఎఫ్ఐ ప్రొఫార్మా-ఎ ,మిడ్‌డేమీల్ ఫారమ్ తప్ప తీసుకురావాలన్నారు. బాడ్మింటన్, చెస్‌కు సంబంధించి ఇద్దరు ఉత్తమ క్రీడాకారులకు తీసుకురావాలన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



వాల్మీకిపురంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరణ



గుర్రంకొండలో డిజిటల్ బుక్ క్యూ ఆర్‌కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ

కలికిరి(వాల్మీకిపురం) : వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని వాల్మీకిపురం మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్ రెడ్డి అన్నారు. వాల్మీకిపురంలో శనివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలన రెడ్ బుక్ పేరిట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే ఎజెండాగా సాగుతోంది తప్ప ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలకుల ద్వారా అన్యాయాలకు గురైన వారు క్యూఆర్ కోడ్ ద్వారా తమకు జరిగిన అన్యాయాన్ని నమోదు చేయాలన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేధించిన వారిపై చర్యలు తీసుకుని కార్యకర్తలకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. వేధింపులకు గురిచేసిన వారు ఎంతటి వారైనా, ఎక్కడున్నా తప్పించుకోలేరని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు నీళ్ళ భాస్కర్, అబ్దుల్ కలీం , చలపతి, సురేష్‌కుమార్‌రెడ్డి, రఘు, రవి, సుధాకర్, వెంకటస్వామి, సత్య, ఖాదర్ బాషా, కుమార్, చంద్రాచారి, నాగరాజ పాల్గొన్నారు.

కార్యకర్తల రక్షణ కోసమే..

గుర్రంకొండ : కార్యకర్తల రక్షణ కోసమే వైఎస్సార్ సీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి డిజిటల్‌బుక్ తీసుకొచ్చారని జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్, మండల పార్టీ కన్వీనర్ ముక్తియార్‌అలీఖాన్ అన్నారు. శనివారం గుర్రంకొండలో డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిసారించడం లేదన్నారు. ప్రతిపక్షనాయకులు, కార్యకర్తలను కేసుల పేరుతో వేధించడమే పనిగా పెట్టుకొందన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా కూటమి ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొవాలన్నారు. కార్యక్రమంలో హౌస్‌ఫెడ్ కార్యదర్శి గయాజ్‌అహ్మద్, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ గణేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు అన్వర్, ఇంతియాజ్, చోటు, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్. నడింపల్లి గ్రామంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని మూడు రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. శనివారం విజేతలకు వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్కు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 30 టీములు హాజరయ్యాయి. మొదటి బహుమతిని గొనిపల్లి జట్టు గెలుచుకోగా జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి రూ.25,116 వేలు బహుకరించారు, రెండవ బహుమతి ఆర్. నడింపల్లి గెలుచుకోగా గ్రామ యూత్ రూ. 15,116వేలు అందించారు.